

బుడమేరులో నిండుగా పారుతున్న వరద నీరు



విజయదుర్గానగర్‌లో ఇళ్లలోకి చేరిన మురుగు



వరద తాకిడికి రహదారిపై కూర్చున్న మహిళలు

బుడమేరులో పెరిగిన వరద ప్రవాహం

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో వరద ప్రవాహం మంగళవారం పెరిగింది. దీంతో విజయదుర్గానగర్‌లోని బుడమేరును ఆనుకుని ఉన్న నివాసాల్లోకి వరద నీరు చేరటంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇళ్లలోకి వరద నీరు, మురుగు రావటంతో స్థానికులు రోడ్డు పైనే గడుపుతున్నారు. ఉదయం ప్రవాహం అధికంగా ఉన్నప్పటికీ సాయంత్రానికి కొంతవరకు ప్రవాహం తగ్గటంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతుండటంతో తిరిగి ప్రవాహం పెరుగుతుందని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇళ్లలోకి వరద, మురుగు నీరు చేరుతున్నా కనీసం పట్టించుకున్నావారే లేరని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

దేశభక్తిని పెంపొందించుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలని.. దేశానికి తమవంతు సేవలు అందించాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణకాంత్ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తిరంగా ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ దేశం మనకు ఏమి ఇచ్చిందని కాకుండా దేశానికి మనం ఏం చేశామని ప్రశ్నించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు త్రివర్ణ పతాకం చేతబూని నినాదాలు చేస్తూ ఏలూరు రోడ్డు చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం విభాగాల్లో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్–1 పరిధిలోని ఖుద్దూస్‌నగర్ ట్విన్ ట్యాంక్ రిజర్వాయర్ వద్ద ఇన్‌లెట్ 350 ఎంఎం డయా స్లూయిజ్ వాల్ మరమ్మతులు గుర్తైందని, దీన్ని మార్చేందుకు కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్ణానందంపేట, పెజ్జోనిపేట, ఖుద్దూస్‌నగర్, కేదారేశ్వరరావుపేట, లోటస్‌ల్యాండ్ మార్క్, అయోధ్యనగర్, రామలింగేశ్వరపేట, శాంతినగర్‌లో బుధవారం సాయంత్రం నీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని స్థానికులు ముందుగానే నీటిని నిల్వచేసుకుని వీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

16 నుంచి హరికథ సప్తాహ మహోత్సవాలు

విజయవాడకల్చరల్: హరికథ పితామహుడు మద్దాడ ఆదిభట్ల నారాయణదాసు 161వ జయంతి సందర్భంగా సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు హరికథ సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్ బుర్రా పద్మనాభశాస్త్రి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ ఉదయం నేమాని నాగలక్ష్మి పార్వతీ పరిణయంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ప్రతి రోజు ఉదయం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హరికథ భాగవతులు హరికథలను గానం చేస్తారన్నారు. 17న ఆదిభట్ల నారాయణదాసు సాహితీ గోష్ఠి, 22న ఆదిభట్ల నారాయణదాసు జయంతి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జనార్దన్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఠాగూర్ గ్రంథాలయాధికారి కె.రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, సీనియర్ పాత్రికేయుడు పూల విక్రమ్ పాల్గొని ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా ఏటా జాతీయ గ్రంథాలయ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. పబ్లిక్ లైబ్రరీలతో పాటు అకడమిక్ లైబ్రరీలు, గ్రంథాలయ వికాసానికి విశేషంగా కృషి చేసిన ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశ వ్యాప్తంగా గ్రంథాలయాల్లో సభలు, సమావేశాలు నిర్వహించి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటున్నామన్నారు. విజయ్‌కుమార్, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది గురునాథంకు సన్మానం



గురునాథంను సత్కరిస్తున్న బీబీఏ అధ్యక్షుడు బాషా, న్యాయవాదులు

విజయవాడలీగల్: సీనియర్ న్యాయవాది, బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, స్టాండింగ్ కౌన్సిల్ మాజీ చైర్మన్ వి.గురునాథం బార్ అసోసియేషన్‌లో ఎన్‌రోల్‌మెంటు అయ్యి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా, సీనియర్ న్యాయవాది శిష్టా హనుమత్ ప్రసాద్ గురునాథం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీబీఏ ప్రధాన కార్యదర్శి కనిశెట్టి వెంకట రంగారావు, ఉపాధ్యక్షుడు పిల్లా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ వరహాలక్ష్మి, ట్రెజరర్ ముద్దాడ సత్యనారాయణ, లైబ్రరీయన్ కంచర్ల త్రినాథ్ కుమార్, మహిళా కార్యదర్శి అనురాధ, స్పోర్ట్స్ సెక్రటరీ పలగాని రవి బాబు, సీనియర్ న్యాయవాదులు, బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో 'ప్రతిభ'కు ర్యాంకులు

– ఎస్జీటీ స్టేట్ టాపర్‌గా కేవీ దుర్గాభవాని



ఎస్జీటీ టాపర్ దుర్గాభవాని, ఇతర అభ్యర్థులను అభినందిస్తున్న ప్రతిభ సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): డీఎస్సీ ఫలితాల్లో విజయవాడలోని ప్రతిభ సెంటర్‌లో శిక్షణ పొందిన వారు ఉత్తమ ర్యాంకులు సాధించారని ఆ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్ తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన కృష్ణలంకకు చెందిన కేవీ దుర్గాభవానీ ఎస్జీటీలో స్టేట్ టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకు సాధించిన వారిని మంగళవారం లబ్బీపేటలోని తమ శిక్షణ సంస్థలో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు సోషల్ అసిస్టెంట్‌లో నరసింహారావు 84.59 మార్కులు, ఎం. రాజేశ్వరి 82.94 మార్కులు, మ్యాథమెటిక్స్‌లో అశోక్ 88.32 మార్కులు, ఫిజికల్ సైన్స్‌లో ప్రకాష్ 75.36 మార్కులు, ఎస్జీటీ విభాగంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో టాపర్‌గా వైఎస్ఎస్ వైదేహి 91.31 మార్కులు సాధించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎస్జీటీలో 100 మంది, స్కూల్ అసిస్టెంట్స్‌లో 150 మంది తమ వద్ద శిక్షణ పొందిన వారు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు.

40 మంది మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 40 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 40 మందిపై ఐదో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. 40 మందిని కోర్టులో హాజరుపరచగా, ఆరో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి లెనిన్‌బాబు 13 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 27 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వంట చేస్తుండగా స్టౌ నుంచి పైపు ఊడిపోవడంతో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంఘటన వాంబేకాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. సింగ్‌నగర్ అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వాంబేకాలనీ ఎ బ్లాకుకు చెందిన ఎస్‌కే కరీముల్లా, ముంతాజ్‌బేగం దంపతులు నివస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం ఉన్నారు. కుమార్తెకు రెండేళ్ల క్రితం వివాహం కాగా ఆమె ఇటీవల ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ చిన్నారిని మంగళవారం ఊయలలో వేసే వేడుకను జరుపుకుందామని నిర్ణయించుకున్నారు. కుటుంబ సభ్యుల వరకు భోజనాలు సిద్ధం చేద్దామని ముంతాజ్ బేగం వంటలు చేస్తూ ఉండగా గ్యాస్ స్టౌ పైపు ఒక్కసారిగా ఊడిపోయింది. దీంతో క్షణాల్లో ఆ గది మొత్తం మంటలు వ్యాపించాయి.

– స్థానికుల చొరవతో తప్పిన ప్రాణనష్టం

ఆమె పెద్దగా కేకలు పెట్టడంతో చుట్టుపక్కల ఉన్న యువకులు అప్రమత్తమై ముందుగా ఇంట్లో ఉన్న పసికందుతో పాటు, బాలింతలు, ఇతర కుటుంబ సభ్యులను బయటకు తీసుకువచ్చేశారు. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఘటనలో గృహోపకరణాలు ఆహుతయ్యాయి. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు తెలిపారు.

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసులు శాఖ ఆధ్వర్యంలో మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాకర్స్ అసోసియేషన్ సహకారంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల క్రీడా మైదానంలో స్వాతంత్ర్య సమరయోధుడు భోగిపర్తి శంకరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యువజన సర్వీసులు శాఖ సీఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉమ్మడి కృష్ణా జిల్లాలో స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అందరితో కలిసి అతిసాధారణ జీవితం సాగిస్తూ.. గాంధీవాదిగా సత్యమేవ జయతే సూత్రాన్ని పాటిస్తూ మన మధ్య తిరుగుతున్న వారిని సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జాతీయ జెండాలు చేత పట్టుకుని కళాశాల మైదానంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, యువజన సర్వీసులు శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో నంబర్ 137 వెంటనే ఉపసంహరించుకోవాలి

బస్టాండ్(విజయవాడపశ్చిమ): గవర్నరుపేట, పాత బస్టాండ్‌ను ప్రైవేటు వ్యాపార సంస్థ లూలూకు ఇస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 137ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎంయూఏ జిల్లా కార్యదర్శి రామకృష్ణారావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజా రవాణా సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గవర్నరుపేట–1, 2 డిపోల ఎదుట ఎస్ఎంయూఏ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. గవర్నరుపేట–1,2 గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు గోపి, మురళీ, సుబ్రమ్మణ్యం, చంద్రమోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూరియాను అందించలేకపోవడం సిగ్గుచేటు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం ఉమ్మడి కృష్ణా జిల్లా రైతన్నలకు కనీసం యూరియాను కూడా అందించలేకపోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రైతులకు పుట్టినిల్లు అయిన ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రభుత్వ నిర్లక్ష్యం.. ముందు చూపులేక ఎరువుల కొరత ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా, డీఏపీ పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు బలంగా ఉన్నాయన్నారు. సొసైటీల్లో ఏ ఒక్క రైతుకూ బస్తాకు మించి ఇవ్వడం లేదనీ, ఇదే అదునుగా కృత్రిమ కొరత సృష్టిస్తున్న ప్రైవేటు వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. జిల్లాలో సోమవారం పలుచోట్ల రైతులు ఎరువుల కోసం ధర్నాలు చేశారన్నారు. పోలీస్ పహారాతో ఎరువులు అందజేస్తున్నారని తెలిపారు. విత్తనం నుంచి విక్రయం దాకా ఊరు దాటాల్సిన అవసరం లేకుండా రైతులకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

నగరంలో 'పరదా' చిత్ర యూనిట్ సందడి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): 'పరదా' చిత్ర ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ మంగళవారం నగరంలో సందడి చేసింది. స్థానిక సత్యనారాయణపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వేడుకలో కథనాయిక అనుపమ పరమేశ్వర్ చిత్ర విశేషాలను వివరించారు. లేడీ ఓరియంటెడ్ పాత్రలో మొదటిసారి నటించే అవకాశం రావటం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 22న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలన్నారు. చిత్ర విశేషాలను దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల, నిర్మాతలు విజయ్, శ్రీనివాస్ పంచుకున్నారు.

ఉరేసుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం పీఎస్ పరిధిలో చెట్టుకు ఉరేసుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో బీఆర్టీఎస్ రోడ్డులోని సరబయ్య ఆలయం వద్ద ఒక చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఎస్ఎన్‌పురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతుని వయస్సు 51 సంవత్సరాలు ఉంటుందని, శరీరంపై తెలుపు గారల చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. అతని జేబులో లభించిన ఆధార్ కార్డులో గంటసాల సోమేశ్వరరావు, తండ్రి పేరు సాంబమూర్తి, జనార్ధరావువీధి, సాయి శ్రీహరిధాం అపార్ట్‌మెంట్, సత్యనారాయణపురం, విజయవాడ అనే చిరునామా ఉంది. అక్కడకు వెళ్లి విచారణ చేసినా మృతుని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలకు ఎస్ఎన్‌పురం పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటానికి మాలలు సిద్ధం కావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ దళితుల ఐక్యతను దెబ్బతీసే అతిపెద్ద రాజకీయ కుట్ర అన్నారు. వర్గీకరణకు నాటి కాంగ్రెస్ పార్టీ హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో బీజం వేసిందని, నేడు అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం వర్గీకరణను దేశవ్యాప్తం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందలో కేవలం నలుగురికి లబ్ధి కలిగే ఎస్సీ వర్గీకరణ ఫలాలు దేశవ్యాప్తంగా ఎస్సీ జాబితాలో ఉన్న 1108 కులాలకు మోదీ ప్రభుత్వం, తెలుగు రాష్ట్రాల్లోని 59 కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఏ విధంగా పంచుతారని ప్రశ్నించారు. ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని నిలదీశారు. వర్గీకరణ వ్యతిరేక పోరాటానికి మద్దతు ప్రకటించాలని కోరారు. మాల మమానాడు నాయకులు కొప్పుల ప్రేమ్‌బాబు, తుమ్మల ఫ్రాన్సిస్, కాకర రవితేజ, కూసి కొండబాబు, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సహజ నటి వాణిశ్రీ

విజయవాడకల్చరల్: సహజ నటి వాణిశ్రీ అని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం వాణిశ్రీ జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. సినీ నటి వాణిశ్రీ ఫోన్ ద్వారా పంపిన సందేశాన్ని నిర్వాహకులు వినిపించారు. జోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, నరసింహారావు, బీవీ వీరభద్రరావు, మహేశ్వరరావు, ప్రభల శ్రీనివాస్, యూవీ రత్నం, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు. విజయలక్ష్మిని సత్కరించారు. వాణిశ్రీ నటించిన చిత్రగీతాలను గాయకులు ఆలపించారు.